డెల్టా జిల్లాలకు సాగునీరు

కల్లనై డ్యాం నుంచి విడుదల చేసిన సీఎం స్టాలిన్

డ్యాం గేట్లు తెరిచిన అనంతరం నీటిలో పూలు చల్లుతున్న స్టాలిన్





తిరుచ్చిలో స్టాలిన్‌కు ఘనస్వాగతం పలుకుతున్న స్థానికులు

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తంజావూరు, నాగై, తిరువారూరు, మైలాడుదురై సహా కావేరి డెల్టా జిల్లాల్లో పంటలకు కల్లనై డ్యామ్ నుంచి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం సాయంత్రం సాగునీటిని విడుదల చేశారు. క్రష్ గేట్లు తెరచుకుని వేగంగా వెలువడిన జలాలపై స్టాలిన్, మంత్రులు పూలు చల్లారు. మేట్టూరు డ్యామ్ నుండి ఈ నెల 12న విడుదల చేసిన జలాలు శనివారం మధ్యాహ్నం తిరుచ్చి ముక్కొంబు ప్రాంతానికి చేరాయి. అక్కడి నుంచి కల్లనై డ్యాంలోకి ప్రవేశించాయి. ఈ డ్యామ్ నుండి కావేరి, పెన్నారు, వెట్టారు. కొళ్ళిడం, పుదు ఆరు అని పిలిచే కల్లనై కాలువకు జలాలను సమంగా విభజించి సరఫరా చేస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్టాలిన్ కల్లనై డ్యామ్ నుండి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మాట్లాడుతూ కల్లనై డ్యామ్ నుండి సెకనుకు 1500 ఘనపుటడుగుల చొప్పున సాగుజలాలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, కోవి చెళియన్, అన్బిల్ మహేష్ పొయ్యా మొళి, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, రఘుపతి, మెయ్యనాధన్, టీఆర్‌బీ రాజా, తంజావూరు జిల్లా కలెక్టర్ ప్రియంకా పంకజం సహా డెల్టా జిల్లాల కలెక్టర్లు, ఎంపీలు టీఆర్‌బాలు, కల్యాణసుందరం, ఎస్.మురసొలి, ఎమ్మెల్యేలు, నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కల్లనై డ్యామ్ కొత్త అందాలను సంతరించుకుంది. అదేవిధంగా కల్లనై డ్యామ్ నిర్మించిన కరికాళచోళ చక్రవర్తి, ఆంగ్లేయ దొర సర్ ఆర్థర్ కాటన్, కావేరి మాత, అగస్త్యమహర్షి, రాజరాజచోళుడి విగ్రహాలు, కల్లనై డ్యామ్‌లో సాగుజలాలు విడుదలయ్యే చోట ఉన్న ఆంజనేయుడి ఆలయం, కరుప్పణ్ణసామి ఆలయం, పార్కులో ఉన్న వినాయకుడి ఆలయం కూడా కొత్త రంగులతో కళకళలాడుతున్నాయి. కల్లనై డ్యామ్ నుండి జలాలును విడుదల చేసిన తర్వాత స్టాలిన్ కారులో బయలుదేరి తంజావూరు నగరానికి చేరుకున్నారు. అక్కడి ప్రభుత్వ అతిథిగృహంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నాక ఆయన తంజావూరు నగరంలో రెండు కిలోమీటర్ల వరకు రోడ్‌షోలో పాల్గొని స్థానిక ప్రజలను నేరుగా కలుసుకోనున్నారు. రోడ్‌షో అనంతరం మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఆదివారం రాత్రి ప్రభుత్వ అతిథిగృహంలో బసచేయనున్నారు.

ఓపీఎస్ ఎమ్మెల్యే పదవికి గండం?

● పిటిషన్‌పై త్వరలో నిర్ణయం : స్పీకర్



చెన్నై, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ సమర్పించిన పిటిషన్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ అప్పావు ప్రకటించారు. తేని జిలా బోడినాయకనూరుకు చెందిన ఓటరు మిలానీ అనే వ్యక్తి ఇటీవల స్పీకర్‌కు ఓ వినతి పత్రం సమర్పించారు. బోడినాయకనూరు నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన ఓపీఎస్ 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థిని వ్యతిరేకిసూ బీజేపీ కూటమి తరఫున ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఓ వైపు అన్నాడీఎంకే శాసనసభ్యుడిగా ఉంటూ అదే పార్టీకి చెందిన ఎంపీ అభ్యర్థికి వ్యతిరేకంగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఎమ్మెల్యే పదవికి అనర్హుడు కాగలుగుతాడని, ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని తగు చర్యలు చేపట్టాలని ఆ వినపతిపత్రంలో మిలానీ పేర్కొన్నారు. ఈ విషయమై స్పీకర్ అప్పావు నగరంలో విలేఖరులతో మాట్లాడుతూ ఓపీస్ శాసనసభ్యుడిగా అనర్హుడని ప్రకటించాలని కోరుతూ బోడినాయకనూరు ప్రాంతానికి చెందిన ఓటరు సమర్పించిన వినతిపత్రంపై న్యాయనిపుణులతో చర్చలు జరుపుతున్నానని, త్వరలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు.

వైగై డ్యాం జలాల విడుదల

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మదురై, దిండుగల్ జిల్లాలకు వైగై డ్యామ్ నుంచి సాగునీరు విడుదల చేశారు. వైగై డ్యామ్ నుంచి పెరియార్ ప్రధాన కాలువ ద్వారా సోమవారం నుంచి అక్టోబరు 12వ తేది వరకు తొలి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, ఆదివారం ఉదయం మంత్రులు ఐ.పెరియస్వామి, మూర్తి క్రస్ట్‌గేట్ల ద్వారా జలాలు విడుదల చేశారు. తొలుత 900 ఘనపుటడుగులుగా విడుదల చేస్తున్న జలాలను క్రమక్రమంగా పెంచుతామని, ఈ జలాలతో మదురై, దిండుగల్ జిల్లాల్లో సుమారు 45 వేల ఎకరాలు లబ్ధిపొందుతాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

జలాలు విడుదల చేస్తున్న మంత్రులు పెరియస్వామి, మూర్తి తదితరులు



పుదుచ్చేరి పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో చెన్నై విమానాశ్రయంలో దిగిన ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వాగతం పలుకుతున్న మంత్రి ఎం.మదివేందన్, మేయర్ ఆర్.ప్రియ తదితరులు



కల్లుగీతపై నిషేధం తొలగించాలని

తాటి చెట్టెక్కిన ఎన్టీకే నేత సీమాన్

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలు చేసి కల్లు విక్రయాలు జరపాలని డిమాండ్ చేస్తూ నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) ఆదివారం ఉదయం ఆందోళనకు దిగింది. ఆ సందర్భంగా పార్టీ నేత సీమాన్ తాటిచెట్టెక్కి, కల్లుతీసి, అందరి చేత తాగించారు. ఇటీవల విల్లుపురం జిల్లాలో కల్లుగీత మహానాడులో పాల్గొన్న సీమాన్ తమిళుల జాతీయ పానీయం కల్లని, దానిని పనంజారు (తాటిచారు), మూలిగైచారు (మూలికల చారు) అని చెబుతారని, ఆరోగ్యానికి ఏ మాత్రం హానిచేయని తాటికల్లు విక్రయాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కల్లుగీత ఉద్యమంలో పాల్గొంటానని కూడా ప్రకటించారు. ఆ మేరకు తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సమీపం పెరియతాళైలో నిర్వహించిన కల్లుగీత ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. కల్లుగీత కార్మికుడిలా తాటిచెట్టెక్కారు. తాటికల్లు బానతో కిందకు దిగారు. కిందకు దిగిన సీమాన్ పార్టీ శ్రేణులకు కల్లు పంచారు. ఈ ఆందోళనలో వందలాదిమంది కల్లు గీత కార్మికులు కూడా పాల్గొన్నారు.

తాటి చెట్టెక్కుతున్న సీమాన్





పార్టీ శ్రేణులతో కల్లు తాగిస్తున్న సీమాన్

అన్బుమణి ఉద్వాసనకు రంగం సిద్ధం!

- సభాముఖంగా తండ్రికి క్షమాపణలు
- అనుచరులతో రాందాస్ చర్చలు
- వడివేల్ రావణన్‌పై వేటు



పార్టీ నేతల సమావేశంలో పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి

అడయార్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)లో అంతర్గత కలహాలు రోజుకో విధంగా మారుతున్నాయి. తండ్రీ కొడుకుల మధ్య తలెత్తిన ఆధిపత్య పోరు చివరకు పార్టీని చుట్టాయి. ఈ నేపథ్యంలో పార్టీని గాడిలోపెట్టేందుకు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాందాస్ నడుంబిగించారు. ఇందులోభాగంగా తనపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన తన తనయుడు డాక్టర్ అన్బుమణిని పార్టీ నుంచి బహిష్కరించేందుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. అన్బుమణిని పార్టీ పదవి నుండి తొలగించే విషయమై రాందాస్ దిండివనం తైలాపురం గార్డెన్‌లోని తన నివాసంలో చర్చలు జరిపారు. అదే సమయంలో అన్బుమణికి మద్దతుగా ఉన్న పార్టీ ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. ఇటీవల తైలాపురంలో రాందాస్ నిర్వహించిన మీడియా సమావేశంలో వడివేలు ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆగ్రహించిన రాందాస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్‌ను బహిష్కరించారు. ఇదిలా ఉండగా ఆదివారం అన్బుమణి పయ్యనూరు వద్ద పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతూ ఫాదర్స్‌డే సందర్భంగా తన తండ్రికి క్షమాపణ చెప్పారు. తన చర్యలు రాందాస్‌కు బాధకలిగించి ఉంటే ఆయనకు భేషరతుగా క్షమాపణలు చెప్పుకుంటున్నానని చెప్పారు. తండ్రికి క్షమాపణ అడగటం వల్ల తనకు మంచే జరుగుతుందని అన్బుమణి అన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ పరీక్షలు

● 2.27 లక్షల మంది హాజరు

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీఎన్పీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1, 1ఏ పోస్టుల భర్తీకి రాష్ట్ర వ్యాప్తంగా ప్రిలిమనరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 28 సబ్ కలెక్టర్, 7 డీఎస్పీ, 19 ఏసీటీవో, 7 గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, 3 జిల్లా ఉపాధి కల్పనాధికారి, 6 కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్ పోస్టుల భర్తీకి ఏప్రిల్ 1న నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆ మేరకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రూప్-1, గ్రూప్ 1ఏ ప్రిలిమనరీ పరీక్షలకు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. ఈ పరీక్షలకు 2,49,296 మంది దరఖాస్తు చేశారు. గ్రూప్-1 పరీక్షలకు 2,27,982 మందిని అనుమతించారు. అదే విధంగా గ్రూప్-ఏ పరీక్షలకు 6465 మదిని అనుమతించారు. రాష్ట్రంలోని 38 జిల్లాలు, ఆరు తాలూకా కేంద్రాలు సహా 44 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నగరంలో గ్రూప్-1 పరీక్షలకు 41,094 మంది హాజరయ్యారు. టీఎన్పీఎస్సీ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడు చేసుకున్న హాల్ టికెట్లు తీసుకొచ్చిన అభ్యర్థులను మాత్రమే పరీక్షకు అనుమతించారు. అంతే కాకుండా ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ పాన్‌కార్డ్, ఓటరు గుర్తింపుకార్డులో ఏదైనా ఒకదాని జిరాక్స్ కాపీని పరీక్షా కేంద్రం నిర్వాహకులు నిశితంగా పరిశీలించిన మీదటే లోపలికి పంపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్షలకు అభ్యర్థులంతా 8.30 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రం లోనికి సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించకుండా కట్టుదిట్టంచేశారు. ఈ పరీక్షలకు 987 మంది అధికారులను ఇన్విజిలేటర్లుగా నియమించారు.

2 నెలల్లో ఫలితాలు...

ఇదిలా ఉండగా గ్రూప్-1, గ్రూప్ ఎ పరీక్షా ఫలితాలు రెండు నెలల్లోగా విడుదలవుతాయని టీఎన్పీఎస్సీ చైర్మన్ ఎస్కే ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఉదయం ఎగ్మూరు గెంగురెడ్డి వీధిలోని ప్రెసిడెన్సీ మహిళా కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పరీక్షా ఫలితాలు వెల్లడైన మూడు నెలల్లోగా మెయిన్స్ నిర్వహిస్తామని తెలిపారు. టీఎన్పీఎస్సీ గత యేడాది 10,701 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించగా, ఈ యేడాది జనవరి నుండి ఇప్పటి వరకు 10,227 మంది ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. ఇకపై నిర్వహించనున్న పరీక్షల ద్వారా 12,231 మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని వివరించారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న టీఎన్పీఎస్సీ చైర్మన్ ఎస్కే ప్రభాకర్



టీవీకే నేత విజయ్‌కు బొట్టుపెడుతున్న విద్యార్థిని

విద్యార్థులకు విజయ్ నగదు కానుకలు

● ఐఐటీలో చేరనున్న రాజేశ్వరికి రూ.2 లక్షలు

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో టెన్త్, ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నాలుగో విడత నగదు బహుమతుల ప్రధానోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఈఈ ర్యాంక్ సాధించి ఐఐటీ మద్రాస్‌లో చేరే గిరిజన విద్యార్థినికి టీవీకే నేత విజయ్ రూ.2లక్షలు అందించి, శాలువతో సత్కరించారు. పదోతరగతి, ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇప్పటివరకూ మూడు విడతలుగా ఆయన నగదు కానుకలు అందజేశారు. ఆదివారం ఉదయం నాలుగో విడతలో 39 నియోజకవర్గాలకు చెందిన టెన్త్, ప్లస్-2 విద్యార్థులకు టీవీకే నేత విజయ్ నగదు బహుమతులు, అవార్డులు ప్రదానం చేశారు. ఆ సందర్భంగా జేఈఈ ర్యాంక్ సాధించి మద్రాస్ ఐఐటీలో చేరనున్న గిరిజన విద్యార్థిని రాజేశ్వరి రూ.2లక్షల నగదు కానుకగా ఇచ్చారు. ఐఐటీ మద్రాస్‌లో ఉన్నత విద్యనభ్యసించనున్న రాజేశ్వరి సైంటిస్టు కావాలని విజయ్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో టీఎంసీ ఆధీనంలోని కాంగ్రెస్ ఆస్తుల స్వాధీనం

● సెల్వపెరుంతగై



కాంగ్రెస్ ఆస్తుల స్వాధీన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సెల్వపెరుందగై

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమిళమానిళ కాంగ్రెస్ (టీఎంసీ) నిర్వాహకుల ఆధీనంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేపట్టినట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వపెరుంతగై పేర్కొన్నారు. తమిళ మానిల కాంగ్రెస్ ఆధీనంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆస్తులను త్వరలో స్వాధీనం చేసుకుంటామని ఆయన ప్రకటించారు. ఏఐసీసీ 2017వ సంవత్సరం నుండి కాంగ్రెస్ ఆస్తుల స్వాధీన కమిటీని జాతీయస్థాయిలో నియమించింది. ఈ కమిటీ ప్రస్తుత ఛైర్మన్‌గా పంజాబ్‌కు చెందిన విజయేంద్ర సింగ్ ఉండగా, రాష్ట్ర కమిటీలో మాజీ ఎంపీ జయం అరుళ్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు తదితరులున్నారు. టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ ఆస్తుల విడిపింపు కమిటీ సమావేశం సెల్వపెరుంతగై అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం తీసుకున్న నిర్ణయం మేరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించి కాంగ్రెస్ ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.



మృతుడు చక్రవర్తి (ఫైల్‌ఫొటో)

పీఎంకే న్యాయవాది మృతి కేసులో మలుపు

కాల్పులు జరిపిన ఇద్దరి అరెస్టు

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది కేసు ఆసక్తికరంగా మలుపులు తిరిగింది. వేలూరు జిల్లా పీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, న్యాయవాది చక్రవర్తి (48) మృతి కేసు కొత్త మలుపు తిరిగింది. మొదట రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై ఆయన ప్రాణాలు కోల్పోయారని భావించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే పోస్టుమార్టం నివేదికలో చక్రవర్తి తలకు గురిపెట్టి తుపాకీతో కాల్చటంతో మృతి చెందినట్టు. దీనితో పోలీసులు ఈ కేసును హత్యకేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు జరిపి హంతకులు ఇద్దరిని అరెస్టు చేశారు.. ఈ నెల 11వ తేదీ రాత్రి బాగా పొద్దుపోయినా ఇంటికి చేరుకోకపోవడంతో చక్రవర్తి కోసం ఆయన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించారు. ఆ సమయంలో రాణిపేట ప్రాంతంలో రోడ్డు పక్కన తలకు బలమైన గాయాలు తగిలి అపస్మారక స్థితిలోవున్న చక్రవర్తిని గుర్తించి షోలింగర్‌లోవున్న ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి చక్రవర్తి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆ తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడుక్కంపారై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో, చక్రవర్తి పడివున్న ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరపటం వల్ల చక్రవర్తి మరణించినట్లు తెలిసింది. తక్షణమే పోలీసులు కాల్పులు జరిపిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.ఎట్టకేలకు రాణిపేట జిల్లా సిప్కాట్ సమీపంలోని మేల్ మల్లారి గ్రామానికి చెందిన ప్రభు (28)ను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుల ఆచూకీ తెలిసింది. దీంతో శనివారం మాధవన్ (26), దురై మురుగన్ (22)లను అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో పాత కక్షల కారణంగా చక్రవర్తిని వారు హతమార్చినట్టు తేలింది.



అరెస్టయిన నిందితులు

సమాచార ధ్వని

డిగ్రీ కళాశాలలో ముగిసిన తొలివిడత కౌన్సెలింగ్

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు సంబంధించిన తొలివిడత కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాలల్లో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ మే 7న ప్రారంభమై 27వ తేదీతో ముగియగా, 2 లక్షల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేశారు. తొలివిడత కౌన్సెలింగ్‌లో తొలుత ప్రత్యేక విభాగాలకు ఈ నెల 2,3 తేదీల్లోను, జనరల్ విభాగంలో 4 నుంచి 14వ తేది వరకు నిర్వహించారు. రెండో విడత కౌన్సిలింగ్‌కు సంబంధించి దరఖాస్తు స్వీకరణ ప్రస్తుతం జరుగుతోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం మొదటి సంవత్సరం తరగతులు ఈ నెల 30వ తేది నుంచి ప్రారంభమవుతాయని కళాశాల విద్య డైరెక్టరేట్ తెలియజేసింది.

లోక్ అదాలత్‌లో 1.12 లక్షల కేసుల పరిష్కారం

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార కమిషన్ తరఫున శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాష్ట్ర న్యాయసేవల కమిషన్ ఛైర్మన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కెఆర్ శ్రీరామ్ సూచనతో కమిషన్ తాత్కాలిక ఛైర్మెన్, న్యాయమూర్తి ఆర్.సుబ్రమణియన్ పర్యవేక్షణలో లోక్ అదాలత్ జరిగింది. మద్రాసు హైకోర్టులోని 6 ధర్మాసనాలు, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లోని రెండు ధర్మాసనాల్లో పెండింగ్ కేసుల విచారణ జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల పెండింగ్ కేసులు విచారించగా, అందులో 1,12,561 కేసులు పరిష్కరించి, 80,27,703 మంది బాధితులకు మొత్తం రూ.631 కోట్లు పరిహారం ఇప్పించారు.

ఈబీకి రూ.15,785 కోట్ల సబ్సిడీ

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గృహాలు, వ్యవసాయానికి ఉచితంగా అందజేస్తున్న విద్యుత్‌కు, 2024-25 సంవత్సరానికి రూ.15,785 కోట్ల సబ్సిడీని విద్యుత్ బోర్డుకు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ అందజేసింది. రాష్ట్రంలో గృహాలకు వంద యూనిట్లు ఉచితంగా, 500 యూనిట్ల వరకు సబ్సిడీపై అందజేస్తున్నారు. వ్యవసాయం, గుడిసెలకు పూర్తిగా ఉచితంగాను, చేనేత సహా పలు రంగాలకు సబ్సిడీతో విద్యుత్ అందిస్తున్నారు. అందుకోసం సబ్సిడీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బోర్డుకు అందజేస్తుంది. ప్రతి ఏడాది ప్రారంభంలో ఏఏ విభాగాలకు ఎంత సబ్సిడీ అందిస్తున్నారు అనే వివరాలను విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ రాష్ట్రప్రభుత్వానికి నివేదికంగా సమర్పిస్తుంది. ఆ ప్రకారం, 2024-25వ సంవత్సరానికి రూ.15,785 కోట్లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందజేసినట్లు అధికారులు తెలిపారు.

దక్షిణాఫ్రికా జట్టుకు డిప్యూటీ సీఎం అభినందనలు

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 'మీ విజయం చెన్నై వరకు ప్రతిధ్వనిస్తోంది' అని ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా జట్టుకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం తన ఎక్స్ పేజీలో... "ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్‌లో అద్భుతమైన విజయం సాధించిన దక్షిణాఫ్రికా జట్టుకు అభినందనలు. ఎన్ని సవాళ్లు ఎదురైనా జట్టును విజయపథకంలో నడిపిన బవుమాకు ప్రత్యేక అభినందనలు. మీరు మీ అద్భుతమైన ప్రదర్శనతో విమర్శకుల నోళ్లు మూయించారు. మార్క్రమ్ సెంచరీ గురించి ప్రస్తావించకుండా ఏ ప్రశంసా పూర్తికాదు. లార్డ్స్‌లో మీ విజయం జోహన్నెస్‌బర్గ్‌లోనే కాకుండా సుదూర చెన్నైలో కూడా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చింది" అంటూ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

నైరుతి రుతుపవనాలతో 9 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇప్పటివరకు 9 శాతం అధిక వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రారంభం నుంచి శనివారం వరకు 29 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 9 శాతం అధికంగా 31.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, రాజధాని నగరం చెన్నైలో ఈ నెల 1 నుంచి శనివారం వరకు సాధారణ వర్షపాతం 33 మి.మీ కాగా, 64 శాతం అధికంగా 54.2 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

సీఎం బీమా పథకంలో 81 లక్షల మంది లబ్ధి

అడయార్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైద్య బీమా పతకంలో 81 లక్షల మంది లబ్ధి పొందినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో వైద్య, ఆరోగ్య రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగా అమలుచేసిన ముఖ్యమంత్రి వైద్య బీమా పథకంలో 81,33,806 మంది రూ.5,878.85 కోట్ల బీమా వినియోగించుకున్నారని ప్రభుత్వం తెలిపింది. అలాగే, 108అంబులెన్స్ సేవల ద్వారా 19 లక్షల మంది గర్భిణులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన 14 లక్షల మంది సహా 79.85లక్షలమంది వినియోగించుకున్నారని సచివాలయం విడుదలచేసిన ప్రకటనలో తెలిపింది.

నామక్కల్ నుంచి అమెరికాకు కోడిగుడ్లు


పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ నుంచి తొలిసారిగా అమెరికాకు కోటి కోడిగుడ్లు ఎగుమతి చేశారు. తలా 4.45 లక్షల కోడిగుడ్ల చొప్పున రిఫ్రిజిరేటర్లతో కూడిన 21 కంటైనర్లతో తూత్తుకుడి హార్బర్ నుంచి ఆదివారం ఉదయం నౌక అమెరికాకు బయల్దేరి వెళ్లింది. భారత్ నుంచి కోడిగుడ్లు దిగుమతి చేసుకునేందుకు అమెరికా అనుమతించడంతో తొలివిడతగా కోటి కోడిగుడ్లు పంపినట్లు కోళ్ల ఫారాల యజమానుల సంఘం తెలియజేసింది.

సాయుధదళం ఎస్పీ అరుణ్ ఆకస్మిక రాజీనామా

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సాయుధదళ విభాగం 12వ బెటాలియన్ కమాండర్ అరుణ్ ఆకస్మికంగా తన ఎస్పీ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాసిన రాజీనామా లేఖను రాష్ట్రప్రభుత్వం అంగీకరించినట్లు డీజీపీ శంకర్ జివాల్ ఆదివారం తెలిపారు. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం ప్రాంతానికి చెందిన అరుణ్ 2013వ సంవత్సరం గ్రూప్-1 పరీక్ష ద్వారా రాష్ట్ర పోలీస్‌శాఖలో డీఎస్పీ హోదాలో చేరారు. ఆయన గత సంవత్సరం ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో, ఆయన తన పదవికి రాజీనామా చేస్తూ రాసిన లేఖను సాయుధదళ విభాగం 12వ బెటాలియన్ ఏడీజీపీ జయరామ్‌కు పంపగా డీజీపీ శంకర్ జివాల్ పరిశీలించి హోంశాఖకు పంపించారు. ఈ లేఖను అంగీకరించినట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది.

పళనిలో త్వరలో బ్రేక్ దర్శనం

ప్యారీస్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో ప్రసిద్ధిచెందిన పళని దండాయుధపాణి స్వామి ఆలయంలో త్వర లో బ్రేక్ దర్శనం అమలులోకి రానుంది. దీనికి రూ.500 టిక్కెట్ రుసుము వసూలు చేయనున్నట్లు తెలిసింది. సుబ్రహ్మణ్య స్వామి కొలువైన పళని ఆలయంలో ఉచిత దర్శనమే కాకుండా రూ.10 నుండి రూ.100 వరకు దర్శనం సదుపాయం ఉంది. ఇటీవల కాలంగా ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా బ్రేక్ దర్శనం కల్పించనున్నట్లు హిందూ దేవాదాయశాఖ ప్రకటించింది. ఈ పథకంలో భక్తులు త్వరగా స్వామి వారిని దర్శించుకునేలా ప్రతిరోజూ సాయంత్ర 3 నుండి 4 గంటల వరకు గంట సమయాన్ని కేటాయిస్తారు. అయితే, పంగుణి ఉత్తిరం, వార్షిక ఉత్సవాలు జరిగే 10 రోజులు, ప్రతినెల కృత్తిక, ఆంగ్ల, తమిళ సంవత్సరాది అని మొత్తం 44 రోజులు బ్రేక్ దర్శనం



పళని దండాయుధపాణి ఆలయం

ఉండదు. కాగా, బ్రేక్ దర్శనానికి అనుమతించిన భక్తులకు దేవస్థానం తరుపున పంచామృతం, టెంకాయ, విభూతి పసుపు సంచిలో ప్రసాదంగా పంపిణీ చేస్తారు.

లక్నో నుంచి కీళ్‌కరై వరకు.... 2వేల కి.మీ. ఎగురుతూ వచ్చిన పావురం

టి.నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): లక్నో నగరంలో ఎగురేసిన రామనాథపురం జిల్లా కీళ్‌కరై ప్రాంతానికి చెందిన హోమర్ పందెపు పావురం 2 వేల కి.మీ. దాకా ప్రయాణించి గమ్యస్థానానికి చేరి ప్రథమ బహుమతి గెలుచుకుంది. కీళ్‌కరై పట్టానియప్పా వీధికి చెందిన ముష్రాఫ్ (28) అనే యువకుడు పందెపు పావురాలు పెంచుతున్నాడు. అతడి దగ్గరున్న రెండేళ్ల హోమర్ జాతి పందెపు పావురాన్ని ఏప్రిల్ 10న లక్నో నగరానికి తీసుకెళ్లాడు. ఆ రోజు ఉదయం 6.50 గంటలకు ముష్రాఫ్‌కు చెందిన పావురంతోపాటు ఇతర రాష్ట్రాల వారు పెంచుతున్న 13 పావురాలను ఎగురవేశారు. ఆ విధంలో లక్నో నుండి ఎగురుతూ వెళ్ళిన చాలా పావురాలు గమ్యస్థానాలకు చేరలేదు. ఈ నేపథ్యంలో 62 రోజుల తర్వాత ముష్రాఫ్ పెంచి హోమర్ పావురం శుక్రవారం



ముష్రాఫ్ పెంపుడు పావురం

సాయంత్రం అతడి ఇంటి వద్ద వాలింది. ఈ విషయమై ముష్రాఫ్ మాట్లాడుతూ రామనాథపురం కీళ్‌కరై నుండా ఈ పావురాన్ని రైలులో లక్నో తీసుకెళ్ళి అక్కడ నిర్దేశిత ప్రాంతంలో ఇతర పావురాలతోపాటు తన పావురాన్ని కూడా ఎగురవేశానని చెప్పారు. ఈ పందెంలో పాల్గొన్న పావురాలకు కోడ్‌నెంబర్లు కలిగిన వెండి కడియాలను వాటి కాళ్ళకు కట్టి ఎగురవేసినట్లు తెలిపారు. చివరకు తన పావురం 62 రోజులపాటు 2 వేల కిలో మీటర్ల దూరం ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరుకుని ప్రథమ బహుమతిని గెలుచుకుందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కీళ్‌కరైలోని పక్షుల పెంపకదార్ల సంఘం నిర్వాహకులు ముష్రాఫ్ ఘనంగా సత్కరించారు.

బస్టాండ్ నిర్మాణ పనుల పరిశీలన

తిరుత్తణి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి రూ.15.67 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండు పనులను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా సకాలంలో నిర్మాణం పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులవద్ద వైద్యసేవలు, పరిశుభ్రత తదితర వసతుల్లో సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.



బస్టాండు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

ఆర్డీవో ఆధ్వర్యంలో రైతుల గ్రీవెన్స్

తిరుత్తణి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి పరిధిలోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఉదయం రైతుల గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు.. ఆర్డీవో కనిమొళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు వారి అభ్యర్థనలకు సంబంధించిన వినతిపత్రాలను ఆర్డీవోకు సమర్పించారు. వీకేఆర్‌పురంలో పంటకాలువలో పేరుకుపోయిన వ్యార్థాలను శుభ్రపరిచేలా మున్సిపాలిటీ అధికారులను ఆర్డీవో కనిమొళి ఆదేశించారు.



రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీవో కనిమొళి తదితరులు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

అడయార్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి భారీ స్పందన లభించింది. 300 మందికి పైగా దాతలు పాల్గొని రక్తం దానం చేశారు. 'రక్తాన్ని దానం చేయండి - ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడదాం' అనే నినాదంతో ఈ యేడాది ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శ్రీరామచంద్ర వైద్య కాలేజీ, పరిశోధనా సంస్థ ట్రాన్స్‌ఫ్యూజన్ వైద్య విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కృష్ణమూర్తి వెల్లడించారు.



రక్తదానం చేస్తున్న యువకుడిన పరామర్శిస్తున్న వైద్యుడు

టీవీకే అధినేత విజయ్‌తో భేటీ కాలేదు

● జాక్టో-జియో నేతల ప్రకటన

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం రాజకీయాలతో సంబంధంలేకుండా పోరాడుతున్నట్లు జాక్టో-జియో సంఘం ప్రకటించింది. శుక్రవారం ఈ సంఘ నిర్వాహకులు తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌ను కలిసి తమ పోరాటాలకు మద్దతు కోరినట్లు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు వాస్తవం కాదని ఆదివారం ఆ సంఘ రాష్ట్ర నిర్వాహకులు మీడియాకు వివరించారు. తమ సంఘం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయపరంగా చెందాల్సిన హక్కుల కోసం 25ఏళ్ళుగా నిరంతరంగా పోరాడుతోందని, ప్రభుత్వాలు మారుతున్నా, తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. తమ సంఘానికి ఏ రాజకీయ పార్టీతో సంబధాలు లేవని తెలిపారు. పాత పింఛన్ విధానం అమలుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ వచ్చే సెప్టెంబర్ 30న సమర్పించనున్న నివేదికపై ప్రభుత్వం నుంచి మంచి ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయని, అప్పటివరకు ఉద్యమాన్ని తాత్కాలికం వాయిదా వేస్తున్నట్లు జాక్టో-జియో సంఘం నిర్వాహకులు తెలిపారు.

కీళడి తవ్వకాల నివేదికను కేంద్రం అంగీకరించాలి

● ప్రధానికి ఎంపీ విల్సన్ లేఖ

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మదురై-శివగంగ జిల్లాల సరిహద్దులోని కీళడి గ్రామంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జరిపిన తవ్వకాలకు సంబంధించిన నివేదికను ఎలాంటి సవరణ లేకుండా పూర్తిగా విడుదల చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు డీఎంకే ఎంపీ విల్సన్ తన ఎక్స్‌పేజీలో తెలిపారు. ఆయన ఆదివారం ప్రధాని రాసిన వివరాలను మీడియాకు వివరించారు. కేంద్రప్రభుత్వం 2015వ సంవత్సరం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు భారత పురావస్తుశాఖ పరిశోధకులు కీళడి ప్రాంతంలో ప్రారంభించిన తవ్వకాలపై 2023లో పురావస్తుశాఖ పరిశోధకులు అమర్‌నాథ్ సమగ్రమైన వివరాలతో 980 పేజీల తుది నివేదికను కేంద్రప్రభుత్వానికి సమర్పించారని, ఈ నివేదికను ఎలాంటి సవరణలు లేకుండా పూర్తిగా విడుదల చేయాలని కోరినట్లు విల్సన్ తెలిపారు.

ఈ విద్యా సంవత్సరంలో 210 పని దినాలు

● శనివారాలు సెలవు

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం టైం టేబుల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఆ ప్రకారం, ఈ విద్యా సంవత్సరం 210 రోజులు పనిదినాలు కాగా, అన్ని శనివారాలు సెలవు ప్రకటించారు. పనిదినాలు ముగిసి 2026 ఏప్రిల్ 24వ తేది చివరి రోజుగా ప్రకటించారు. మొదటి మిడ్-టర్మ్ పరీక్షలు జూన్ 16వ తేది ప్రారంభం కానున్నాయి. త్రైమాసిక పరీక్షలు సెప్టెంబరు 18 నుంచి 26వ తేది వరకు నిర్వహించి, 9 రోజుల త్రైమాసిక సెలవుల అనంతరం అక్టోబరు 6న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అలాగే, అర్థ వార్షిక పరీక్షలు డిసెంబరు 15 నుంచి 23వ తేది వరకు నిర్వహించి, 12 రోజుల అర్ధవార్షిక సెలవుల అనంతరం జనవరి 5వ తేది పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. వార్షిక పరీక్షలు ఏప్రిల్ 10 నుంచి 24వ తేది వరకు నిర్వహించి, పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. ఇవి మినహా దీపావళికి 3 రోజులు, సంక్రాంతి పండుగకు 5 రోజులు, ఈ విద్యా సంవత్సరం అన్ని శనివారాలు సెలవు ప్రకటించారు. ఇక, టెన్త్, ప్లస్-1, ప్లస్-2 పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ త్వరలో విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

నేడు, 18న తిరువణ్ణామలై మెము రద్దు

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు రైలుమార్గంలో కాట్పాడి యార్డులో ఇంజనీరింగ్ పనులు చేపడుతున్న కారణంగా సోమవారం, బుధవారాల్లో తిరువణ్ణామలై మెము సేవలను రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. కాట్పాడి రైల్వేయార్డులో ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు నిర్వహించనున్న సందర్భంగా చెన్నై బీచ్-తిరువణ్ణామలై, తాంబరం-తిరువణ్ణామలైతో పాటు 6 రైళ్ల వేళలు మార్పు చేయనున్నారు. ఆ మేరకు సోమ, బుధవారాల్లో చెన్నై బీచ్-తిరువణ్ణామలైకి సాయంత్రం 6 గంటలకు, కాట్పాడి-తిరుపతికి రాత్రి 9.10గంటలకు, తిరుపతి-కాట్పాడికి రాత్రి 7.10 గంటలకు నడిపే మెము రైళ్లు రద్దయ్యాయి. ఇవి కాకుండా తిరువణ్ణామలై-తాంబరం మధ్య ఈ నెల 17,19 తేదీల్లో తెల్లవారుజామున 4 గంటలకు నడపనున్న మెము రైళ్ల సేవలు రద్దు కానున్నాయి. అలాగే సోమ, బుధవారాల్లో అరక్కోణం-కాట్పాడి మధ్య నడిపే మెము ప్యాసింజర్ రైలు, కాట్పాడి-సేవూరు, విల్లుపురం-కాట్పాడి, వేలూరు-కాట్పాడి రైళ్లు పాక్షికంగా రద్దవుతాయని రైల్వే అధికారులు తెలిపారు. కాగా, చెన్నై సెంట్రల్-గుమ్మడిపూండి మార్గంలో, కవరైపేట-గుమ్మడిపూండీ మధ్య రైల్వేలైన్ అభివృద్ధి పనులు జరుగుతున్నందువల్ల చెన్నై బీచ్-గుమ్మడిపూండి సబర్బన్ రైళ్లలో 19 రైళ్ల సేవలను సోమ, బుధవారాల్లో మార్పు చేస్తున్నట్లు దక్షిణ రైల్వేశాఖ తెలిపింది.

మహిళలకు రక్షణ కల్పించాలి

ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్



ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ళు మహిళల సమస్యలను పట్టించుకోని డీఎంకే ప్రభుత్వం మిగిలివున్న పాలనలోనైనా మహిళలకు రక్షణ కల్పించాలని అమ్మామక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ డిమాండ్ చేశారు. రాయపేటలోని ఏఎంఎంకే ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2021 నుంచి డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రంలో శాంతిభద్రలు క్షీణించాయని ఆరోపించారు. తిరువారూర్ జిల్లా కొరడాచ్చేరి ప్రాంతంలో పశువులను మేపుతున్న మహిళపై అత్యాచారానికి పాల్పడి హత్యచేసిన సంఘటనపై నిందితులను అరెస్టు చేయలేదని ఆరోపించారు. ఇటీవల కాలంలో విద్యార్థినులు, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేయలేదన్నారు. మిగిలిన పాలనలోనైనా మహిళలు స్వేచ్ఛగా జీవించేలా వారికి రక్షణ కల్పించాలని దినకరన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లైంగిక వేధింపుల కేసులో ప్రిన్సిపాల్‌కు 23 ఏళ్ల జైలు

అడయార్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో ముద్దాయిగా తేలిన కరూర్ జిల్లా కులిత్తలై ప్రాంతానికి చెందిన కాలేజీ ప్రిన్సిపాల్ సెంథిల్ కుమార్ (53)కు 23 ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధిస్తూ జిల్లా అదనపు ప్రిన్సిపల్ మహిళా కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. కులిత్తలైలోని ఓ కళాశాల విద్యార్థిని హాస్టల్‌లో ఉండేది. ఈ నేపథ్యంలో కాలేజీ ప్రిన్సిపాల్ సెంథిల్ కుమార్ ఆ యువతిని లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయగా, కరూర్ జిల్లా అదనపు ప్రిన్సిపల్ కోర్టులో విచారణ సాగింది. ఈ కేసులో ముద్దాయిగా తేలిన సెంథిల్ కుమార్‌కు 23 ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధిస్తూ కోర్టు శుక్రవారం తుదితీర్పు వెలువరించింది. అలాగే, రూ.1000 అపరాధం విధించింది. బాధితురాలికి ప్రభుత్వం రూ.7 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని ఆదేశించింది.

వరకట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపులు తట్టుకోలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పుదుకోట జిల్లాలో చోటుచేసుకుంది. సెంబట్టిముగప్పు గ్రామానికి చెందిన భారతిరాజా, కీర్తన (22)లకు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగి, ఏడాదిన్నర వయసు కుమారుడు కెవిన్ ఉన్నాడు. వివాహ సమయంలో కీర్తన తల్లిదండ్రులు వరకట్నంగా నాలుగు సవర్ల బంగారం, మోటార్ సైకిల్, వంట సామగ్రి ఇచ్చారు. కాగా, కొంతకాలంగా భారతిరాజా, తల్లి రాగమ్మాళ్ అదనంగా వరకట్నం ఇవ్వాలని వేధిస్తున్నట్లు సమాచారం. దీనికోసం వారు ఆమెను పుట్టింటికి పంపించారు. తల్లిదండ్రులు ఆమెను సమాధానపరచి భారతిరాజా ఇంటికి పంపారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి తల్లికి ఫోన్ చేసిన కీర్తన, భర్త, అత్త వేధింపులు తట్టుకోలేక పోతున్నాని, ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ కట్ చేశారు. అనంతరం గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వరకట్నం వేధింపులు తట్టుకోలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందనే మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఉడయాలిపట్టి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రైవర్ హత్యకేసులో ఆరుగురి యావజ్జీవ శిక్ష రద్దు

టినగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో కారు డ్రైవర్‌ను దారుణంగా హత్యచేసిన కేసులో తండ్రి, కొడుకు సహా ఆరుగురికి దిగువకోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు రద్దు చేసింది. క్రోంపేటకు చెందిన పారిశ్రామికవేత్త కుమార్తె తో కారు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని మరొక డ్రైవర్ చెప్పడంతో ఆగ్రహం చెందారు. 2010లో పారిశ్రామిక వేత్త, ఆయన కుమారుడు, కారు డ్రైవర్ కన్నన్, కిరాయిముఠాకు చెందిన విజయకుమార్, జాన్, సెంథిల్‌తో కలిసి డ్రైవర్ బాబును హత్యచేశారు. ఈ విషయమై బాబు తండ్రి ఫిర్యాదు మేరకు చెన్నై అభిరామపురం పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరిపారు. ఈ కేసుపై విచారణ జరిపిన చెన్నై రెండో అదనపు సెషన్స్ కోర్టు పారిశ్రామికవేత్త, ఆయన కుమారుడు సహా ఆరుగురికి 2024 అక్టోబర్‌లో యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలుచేస్తూ నిందితులు ఆరుగురూ హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఆ అప్పీలుపై విచారణ జరిపిన న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, ఎన్.సెంథిల్ కుమార్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ కేసులో కీలకమైన సాక్షి పారిశ్రామికవేత్త కుమార్తె దిగువ కోర్టులో తప్పుడు సాక్ష్యం ఇచ్చారని, పోలీసు శాఖ తరఫున నిందితులు ఆరుగురిపై ఆరోపణలను సక్రమంగా రుజువు చేయలేకపోయిందంటూ దిగువ కోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను రద్దు చేసి విడుదల చేస్తూ తీర్పు వెలువరించింది.

పెళ్లైన మరుసటిరోజే ప్రియుడితో జంప్

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వివాహమైన మరుసటిరోజే ప్రియుడితో పరారైన యువతి కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపం ఆత్తూర్‌కు చెందిన సతీష్ (28)కు వేలూరు జిల్లా ఆనైకట్టు సమీపం పాడయూరుకు చెందిన రేఖ (23)తో ఈ నెల 8వ తేది ఆరణిలో వివాహం జరిగింది. మరుసటిరోజైన 9వ తేది సతీష్, భార్య రేఖతో కలసి పాడయూరులో ఉన్న మామ ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన రేఖ తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం పలు ప్రాంతాల్లో గాలించిన సతీష్, ఈ నెల 12న వేలూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ వ్యవహారంపై పోలీసులు చేపట్టిన విచారణలో... ఆనైకట్టు సమీపం దేవకారన్‌పట్టి ప్రాంతానికి చెందిన ప్రియుడుతో కలసి రేఖ వెళ్లినట్లు తెలియడంతో, పరారైన ఆ జంట కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బాల్య వివాహం వ్యవహారం... నలుగురిపై కేసు నమోదు

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహం చేసుకున్న వ్యవహారంలో యువకుడు సహా నలుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈరోడ్ సూరంపట్టి నారాయణస్వామి వీధికి చెందిన బాలన్ కుమారుడు దినేష్ (19)కు ఈరోడ్‌కు చెందిన బాలికతో ఇరు కుటుంబాల అంగీకారంతో వివాహం జరిపించారు. ప్రస్తుతం బాలిక గర్భం దాల్చగా, పరీక్షలకు ఆసుపత్రికి తీసుకెళ్లిన సమయంలో బాల్య వివాహం అని తెలిసింది. ఈ వ్యవహారంపై ఈరోడ్ మహిళా పోలీసులు విచారణ జరిపి, దినేష్, అతడి తల్లి గౌరి, బాలిక తల్లిదండ్రులు నలుగురిపై బాల్యవివాహం నిరోధక చట్టం, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

కారు బోల్తా

● యువతికి గాయాలు

టినగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ పెరుందురై పవళత్తాంపాళయం వద్ద అదుపు తప్పిన కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించిన యువతి స్వల్ప గాయాలతో బయటపడింది. ఈరోడ్ టీచర్స్ కాలనీలో నివసిస్తున్న తులసిమణి కుమార్తె వనజకు ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చింది. శనివారం సాయంత్రం డ్యూటీలో చేరడానికి వనజ కారులో కాలేజీకి బయలుదేరింది. పవళత్తాంపాళయం వద్ద కారుకు అడ్డంగా కుక్క రావడంతో వనజ సడెన్ బ్రేకు వేయటంతో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. కారులోని ఎయిర్‌బ్యాగ్ పనిచేయడంతో వనజ స్వల్పగాయాలతో బయటపడింది. స్థానికులు బోల్తాపడిన కారులో నుండి ఆమెను బయటకు లాగి చికిత్స కోసం అంబులెన్స్‌లో ఈరోడ్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



బోల్తాపడిన లగ్జరీ కారు

చాక్లెట్ల ప్యాకెట్లలో గంజాయి తరలింపు

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చాక్లెట్ల ప్యాకెట్‌లో గంజాయి తరలిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పొల్లాచ్చి రైల్వేస్టేషన్‌లో పోలీసులు శనివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని విచారించగా, తేని జిల్లా బోడికి చెందిన దివాకర్ అని తెలిసింది. అతడి బ్యాగ్ పరిశీలించగా, అందులో చాక్లెట్ ప్యాకెట్లున్నాయి. ఈ ప్యాకెట్లపై టేపు వేసి ఉండడాన్ని గమనించిన పోలీసులు, ప్యాకెట్లు తెరచిచూడగా అందులో ఉన్న 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తేనిలో గంజాయి కొనుగోలు చేసి మదురై చేరుకుని, అక్కడి నుంచి పొల్లాచ్చికి రైలులో గంజాయి తరలించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు దివాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.



గంజాయి దాచిన చాక్లెట్ ప్యాకెట్ (పక్క చిత్రంలో) నిందితుడు దివాకర్

నాటుబాంబు పేలి మహిళ దుర్మరణం

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరం సమీపంలో పేలుడు మందు తయారుచేసే భవనంలో నాటుబాంబు పేలిన ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు చిదంబరం సమీపంలోని సంబంధం గ్రామంలో నాటుబాంబులు తయారుచేసే భవనంలో ఆదివారం హఠాత్తుగా ఓ నాటుబాంబు పేలింది. ఈ ఘటనలో అక్కడ పనిచేస్తున్న కార్మికుల్లో ఒకరైన లత (35) మృతిచెందగా, ఆ భవనం కూడా పూర్తిగా నేలమట్టమైంది. ఎస్పీ జయకుమార్, చిదంబరం డీఎస్పీ అగస్త్యన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి సంబంధిత భవన యజమానిని అదుపులోకి తీసుకున్నారు.



నేలమట్టమైన భవనం

విమానాల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు శివమొగ్గ, రాత్రి 8.35 గంటలకు కొచ్చి, 9 గంటలకు కొలికోడుకు బయల్దేరాల్సిన విమానాలు రద్దయ్యాయి. అలాగే, కొలికోడు, అండమాన్, శివమొగ్గ నుంచి మీనాంబాక్కం రావాల్సిన విమానాలు రద్దయ్యాయి. నిర్వాహణ కారణాలు, తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో విమానాలు రద్దు చేసినట్లు, ఆ విమానాల్లో వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

కత్తి పట్టుకుని 'రీల్స్'

● ఇద్దరు యువకుల అరెస్ట్

పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియాంతోపులో కత్తి చేతబట్టి 'రీల్స్' చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు యువకులు కత్తి చేతబట్టి చేసిన విన్యాసాలతో కూడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై పులియాంతోపు పోలీసులు విచారించి, ఐస్ హౌస్ యానైకుళం ప్రాంతానికి చెందిన రిజ్వాన్, పులియాంతోపు కన్నికాపురానికి చెందిన మహ్మద్ పసల్‌లను అరెస్ట్ చేశారు. వీరిలో రిజ్వాన్‌పై ఇదివరకే రెండు క్రిమినల్ కేసులున్నట్లు తెలిసింది. ఇద్దరిని కోర్టులో హాజరపరచి న్యాయమూర్తి ఉత్తర్వులతో జైలుకు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.





ఆలయ గోపుర కలశాలకు బంగారు పూత పూస్తున్న స్వర్ణకారులు - విమాన గోపుర కలశ విడిభాగాలు

తిరుచెందూరు కలశాలకు మెరుగులు

● 14 ఏళ్లయినా చెడిపోని రాగులు



ఆలయ ప్రధాన గోపుర కలశం నుండి సేకరించిన రాగులు

టి.నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవదైన తిరుచెందూరు ఆలయంలో మహాకుంభాభిషేక ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈ ఆలయంలో జీర్ణోద్ధరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్ల మేర నిధులు కేటాయించింది. రెండేళ్లుగా కొనసాగిన ఈ పనులు ముగింపు దశకు వచ్చాయి. 14 యేళ్ల తర్వాత ఈ ఆలయ మహాకుంభాభిషేకం జరుగనుంది. తొమ్మిదంతస్థుల ఆలయ రాజగోపురం పైన కలశాలన్నింటినీ కిందకు దించి వాటికి మెరుగులు దిద్దుతున్నారు. ఇదేవిధంగా గర్భాలయం, షణ్ముఖస్వామి సన్నిధి, పెరుమాళ్ సన్నిధి, వళ్ళి, దైవానై, నటరాజర్ సన్నిధి సహా ఆరు సన్నిధుల గోపుర విమాన కలశాల మరమ్మతులు కూడా చేపడుతున్నారు. ఆలయ రాజగోపురంపైనుంచి దించిన ప్రధాన కలశాలను స్వర్ణకళాకారులు తెరచి చూడగా 14 యేళ్ల క్రితం కుంభాభిషేకం సందర్భంగా అందులో నింపిన రాగులు ఇంకా తాజాగా ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. సాధారణంగా ఆలయ గోపుర కలశాలలో గోధుమలు, రాగులు, సజ్జలు వంటి ధాన్యాల్లో ఏదైనా ఒకదానితో నింపి, పవిత్ర నదీ జలాలతో సంప్రోక్షిస్తారు. ఆ రీతిలోనే 14 ఏళ్ల క్రితం రాజగోపుర కలశాలలో పోసిన రాగులు రంగు మారకుండా, బూజు పట్టకుండా ఉండటం గమనించి ఆలయ అధికారులు కూడా ఆశ్చర్యపోయారు. ఆ రాగులను ఆలయంలో భద్రపరిచారు. ఇక నటరాజస్వామి వారి సన్నిధి గోపురంపై కలశంలో నెమలిపింఛం, మూలవర్లు, దైవానై గోపుర కలశాలలో రాగిరేకులు ఉండటం గమనించారు. వాటిని కూడా ఆలయంలో భద్రపరిచారు. ఆ తర్వాత ఈ కలశాలకు బంగారు తాపడం పనులు చేపట్టారు. ఈ కలశాలకు బంగారు పూత వేసే పనులు ఒకటి రెండు రోజులలో ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రామేశ్వరం, మండపం ప్రాంతాల్లో

చేపల వేటకు బ్రేక్



మండపం తీరంలో ఎగసిపడుతున్న అలలు

చెన్నై, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మన్నార్ జలసంధి ప్రాంతంలో పెనుగాలులు వీస్తుండటంతో రామనాథపురం జిల్లాలోని రామేశ్వరం, మండపం తదితర ప్రాంతాల జాలర్లు చేపలవేటకు వెళ్ళకూడదని రాష్ట్ర మత్స్యశాఖ ఉన్నతాధికారులు నిషేధం విధించారు. చేపలవేట నిషేధ కాలం శనివారం అర్ధరాత్రి ముగియడంతో రామేశ్వరం, మండపం, పాంబన్, తొండి, ఉచ్చిపుల్లి, మూక్కైయూరు తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు సుమారు



పాంబన్ తెర్కువాడి రేవులో లంగరేసిన మరపడవలు

5వేల మరపడవలతో చేపలవేటకు బయలుదేరటానికి సిద్ధమయ్యారు. అదే విధంగా సముద్రంలో తక్కువ దూరంలో చేపలుపట్టే జాలర్లు నాటు పడవలతో సామగ్రి సహా సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా మన్నార్‌జలసంధి దక్షిణ సముద్రతీరం వైపు గంటకు 45 నుండి 55 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీచాయి. ఈ పెనుగాలుల కారణంగా ఆదివారం వేకువజాము నుంచి తీరం పొడవునా 5 నుండి 8 అడుగుల ఎత్తువరకు అలలు ఎగసి పడ్డాయి. ఈ నేపథ్యంలో ధనుష్కోడి, పాంబన్, మండపం ప్రాంతాల జాలర్లు చేపలవేటకు వెళ్లొద్దని మత్స్యశాఖ ఉన్నతాధికారులు నిషేధం విధించారు. రాక్షస అలల బారినుండి జాలర్లను కాపాడేందుకోసమే ఈ నిషధ ఉత్తర్వు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో పాంబన్ తెర్కువాడి రేవు ప్రాంతంలో సుమారు వెయ్యి మరపడవలను లంగరేసి ఉంచారు. 61 రోజుల చేపలవేట నిషేధ కాలం ముగిసిన తొలిరోజే చేపలవేటకు వెళ్లలేని పరిస్థితులు దాపురించడంతో జాలర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

సీహెచ్‌సీ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వలసరవాక్కం సీహెచ్‌సీ ఫార్మసీలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

టి.నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కంలోని సీహెచ్‌సీ ఫార్మసీ బ్రాంచిలో ఆదివారం ఉదయం ఫాదర్స్‌డే సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి ఈసీజీ, బీపీ, బ్లడ్ గ్లూకోజ్, బోన్ డెన్సిటీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీహెచ్‌సీ ఫార్మసీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.సెంథిల్ గాండీబన్ మాట్లాడుతూ గత యేడాది ప్రారంభించిన తమ సంస్థకు నగరవాసులు ప్రోత్సాహం ఇస్తున్నారని, వీరికి ముందస్తు వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహించడం వల్ల ఆరోగ్యంపై చక్కటి అవగాహన ఏర్పడుతుందని అన్నారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఆనందకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్‌టాక్సీ డ్రైవరుగా కీర్తి పాండ్యన్

● 'అక్కేనమ్' ఆడియో రిలీజ్



ఆడియో రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

చిత్రజ్యోతి

సీనియర్ నటుడు అరుణ్ పాండ్యన్, ఆయన కుమార్తె కీర్తి పాండ్యన్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'అక్కేనమ్'. 'అన్బిర్కినియాల్' సినిమా తర్వాత తండ్రీకుమార్తెలు కలిసి నటించారు. అరుణ్ పాండ్యన్ సొంతంగా ఏ అండ్ పీ గ్రూపు పతాకంపై రూపొందించగా ఈ చిత్రానికి ఉదయ్ కె.దర్శకుడు. మూడు పాత్రల చుట్టూ స్క్రీన్‌ప్లే సాగుతుంది. అరుణ్ పాండ్యన్ నిర్మించడంతో పాటు ముఖ్య పాత్ర పోషించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలు శనివారం నగరంలో జరిగాయి.. కీర్తి పాండ్యన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో కాల్‌టాక్సీ డ్రైవరుగా నటించాను. రియల్ లైఫ్‌లోనూ డ్రైవింగ్ అంటే నాకు చాలా ఇష్టం. ఒక పాటలో డాడీ ఎంతో యంగ్‌గా కనిపిస్తారు. ఒడిశా బ్యాక్‌డ్రాప్‌లో కథ సాగుతుంది. ఈ చిత్రానికి పనిచేసిన దర్శకుడు, ఎడిటర్, సంగీత దర్శకుడు కొత్తవారు' అని పేర్కొన్నారు. అరుణ్ పాండ్యన్ మాట్లాడుతూ, 'ఒక మంచి చిత్రాన్ని నిర్మించాం. ఈ సినిమా చూసేందుకు వచ్చే ప్రేక్షకుడికి డబ్బు వృధా కాదు. ఎందుకంటే స్క్రీన్‌ప్లే చాలా బలంగా ఉంది. ఈ మూవీకి మూడు ప్రత్యేకతలున్నాయి. టెక్నీషియన్లంతా చాలాబాగా పనిచేశారు. ఒడిశాలో షూటింగ్ చేశారు. ఇందుకోసం చిత్ర బృందంతో రెండేళ్ళపాటు కలిసి పనిచేశాను' అని పేర్కొన్నారు.

రజనీతో భేటీ.. ఓ మధురానుభూతి

● అభిషన్ జీవింత్



రజనీకాంత్‌తో అభిషన్ జీవింత్

తాను సినిమాల్లోకి అడుగుపెట్టిన కారణం ఇపుడు పూర్తయినట్టుగా భావిస్తున్నట్టు యువ దర్శకుడు అభిషన్ జీవింత్ అన్నారు. శశికుమార్, సిమ్రన్ జంటగా అభిషన్ రూపొందించి చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ'. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ఘన విజయం సాధించింది. చిన్న బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం భారీ కలెక్షన్స్ రాబట్టి ఇప్పటికీ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సినిమాను తాజాగా వీక్షించిన సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్ర దర్శకుడిని తన ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా అభిషన్ జీవింత్ ఓ ట్వీట్ చేస్తూ, 'నేను సినిమాల్లోకి అడుగుపెట్టడానికి కారణమే ఇపుడు పూర్తయినట్టుగా భావిస్తున్నాను. రజనీ సర్.. నన్ను పేరుతో పిలిచి ఆలింగనం చేసుకున్న విధానంతో నేను మధురానుభూతి (థ్రిల్)కి లోనయ్యాను. గొప్పతనానికి ప్రతిరూపమైన ఓ మహానటుడు నన్ను కౌగలించుకున్నారు. ఆ మరుపురాని క్షణం కంటే గొప్ప ప్రేరణ, ఆశీస్సులు కోరుకోలేదు. ఇలాంటి అవకాశం కల్పించిన చిత్ర నిర్మాత మహేష్ రాజ్‌కు ధన్యవాదాలు. సౌందర్య మేడమ్ మిమ్మలను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది' అని అభిషన్ జీవింత్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

పెళ్లి వదంతులకు చెక్ పెట్టిన అనిరుధ్ రవిచందర్



తన పెళ్ళిపై వస్తున్న వార్తలకు ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. సన్ గ్రూపు ఛైర్మన్, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ కుమార్తె కావ్య మారన్, అనిరుధ్ రవిచందర్ త్వరలోనే పెళ్ళిపీటలెక్కబోతున్నారంటూ ప్రచారం సాగింది. ఈ వార్త కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై అనిరుధ్ స్పందించారు. 'వివాహమా? దయచేసి పుకార్లను సృష్టించవద్దు' అని ట్వీట్ చేస్తూ పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టారు. కాగా, ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్-2', విజయ్ నటించే 'జన నాయగన్', శివకార్తికేయన్ 'మదరాసి', ప్రదీప్ రంగనాథన్ నటించే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'కింగ్‌డమ్', ది ప్యారడైజ్ వంటి పలు చిత్రాలకు అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చుతూ ఎంతో బిజీగా ఉన్నారు. అయినప్పటికీ అనిరుధ్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడంటూ ప్రచారం సాగడంతో దానికి ఆయన ఫుల్‌స్టాప్ పెట్టారు.

నా.ముత్తుకుమార్ జయంతి వేడుకలు

జూలై 19న సంగీత విభావరి



మీడియా సమావేశంలో పాల్గొన్న సినీ ప్రముఖులు

ప్రముఖ పాటల రచయిత దివంగత నా.ముత్తుకుమార్ 50వ జయంతి వేడుకలను పురస్కరించుకుని, ఆయన జ్ఞాపకార్థం జూలై 19వ తేదీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పెరియమేడులోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ సంగీత కచ్చేరి వేదికను 8 మంది సంగీత దర్శకులు పంచుకోనున్నారు. ఈ విషయాన్ని శనివారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, దర్శకులు లింగుస్వామి, ఉదయకుమార్, ఏఎల్ విజయ్, ధనుంజయన్ వెల్లడించారు. తమిళ చిత్ర పరిశ్రమలో తన పాటల ద్వారా నా.ముత్తుకుమార్ ఒక ప్రత్యేక ముద్ర వేసి, లక్షలాది మంది అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేశారని వెల్లడించారు. అతి చిన్న వయసులోనే భౌతికంగా దూరమై తమతో పాటు లక్షలాది మంది సినీ అభిమానులకు శోకాన్ని మిగిల్చారన్నారు. ఈ నేపథ్యంలో నా.ముత్తుకుమార్ 50వ జయంతి వేడుకను సంగీత కార్యక్రమంతో నిర్వహించి, ఆయనకు ఘన నివాళి అర్పించాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు. కాగా, ఈ కార్యక్రమాన్ని ఏసీటీసీ సహకారంతో నిర్మిస్తున్నారు. ఇందులో నేపథ్యగాయకులు సిద్ధార్థ్, ఆండ్రియా, టిప్పు ఉత్తర, ఉన్నికృష్ణన్, సైంధవి, హరిణి, సంగీత దర్శకులు జీవీ ప్రకాష్ కుమార్, హ్యారీస్ జయరాజ్, థమన్, సంతోష్ నారాయణన్, విజయ్ ఆంటోనీ, కార్తీక్ రాజా, నివాస్ కె.ప్రసన్న పాలుపంచుకుంటారని అగ్రహీరోలు కమల్ హాసన్, సూర్య, ధనుష్, శింబు, రవి మోహన్, శివకార్తికేయన్‌తో సహా అనేక మంది సినీ హీరోలు ప్రత్యేక అతిథులుగా పాల్గొనేందుకు అంగీకరించారని వారు వెల్లడించారు.

దివ్యాంగులకు సహాయాల పంపిణీ



దివ్యాంగులతో మంత్రి శేఖర్‌బాబు, ట్రస్ట్ నిర్వాహకులు

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూలైలోని ఆదినాథ్ జైన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత సహాయాల పంపిణీ కార్యక్రమం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ రాజేష్‌జైన్, మంత్రి శేఖర్‌బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. 600 మంది దివ్యాంగులకు రణూలాల్ దేవరప్రకాశ్ చంద్ గులేచా అందించిన విరాళం రూ.30 లక్షలతో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్స్ తదితరాలను ఉచితంగా పంపిణీ చేశారు. నిర్వాహకులు ధన్‌రాజ్ కొచ్చర్, అజిత్ చోర్డియా, సంఘ్వీ జైన్, అశోక్ చవాటియా, ప్రకాశ్‌చంద్ గులేచా, సురేష్ జైన్, జావర్‌లాల్ ధార్హా, హరీష్‌జైన్ ఆ వివరాలు వెల్లడంచారు. మంత్రి శేఖర్‌బాబు ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

వీఎస్ ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ విజేతలకు సత్కారం



కార్యక్రమంలో పాల్గొన్న మురుగప్పా గ్రూపు మాజీ చైర్మన్ ఎంఎం మురుగప్పన్, రామరాజ్ కాటన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఆర్ నాగరాజన్, సినీ దర్శకుడు ఆర్కే సెల్వమణి తదితరులు

టి.నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఎస్ మెడికల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో క్యాన్సర్ నుంచి సంపూర్ణంగా కోలుకున్న సుమారు 200 మందిని ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో మురుగప్పా గ్రూపు మాజీ చైర్మన్ ఎంఎం. మురుగప్పన్, రామరాజ్ కాటన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఆర్ నాగరాజన్, సినీ దర్శకుడు ఆర్కే సెల్వమణి, ప్రవచనకర్త మోహనసుందరం తదితరులు పాల్గొన్నారు. క్యాన్సర్ బాధితులకు సేవలందించటంలో అండగా నిలిచిన నాగు చిదంబరం, గీతు నాగు, తిరుపతి, కనకి తిరుపతి, రవి సుందరేశన్‌లను హార్ట్ ఆఫ్ గోల్డ్ అవార్డులతో సత్కరించారు. డాక్టర్ ఎస్.సుబ్రమణియన్ మాట్లాడుతూ క్యాన్సర్ వచ్చిందంటే మానసికంగా క్రుంగిపోకుండా ధైర్యంగా నిలిచి దానికి తగిన చికిత్స తీసుకుంటే ఆ మహమ్మారి బారి నుండి విముక్తులు కాగలుగుతారని చెప్పారు.

యాభై ఏళ్లనాటి బాల్య స్మృతులు

గోల్డెన్ జూబ్లి అ'పూర్వ' సమ్మేళనం

● శ్రీరామకృష్ణ మిషన్ స్కూలు పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వ విద్యార్థులతో గోటేటి వెంకటేశ్వరరావు, కాసల నాగభూషణం, ప్రిన్సిపాల్ దేవసేన తదితరులు

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ పనగల్ పార్కు సమీపంలోని రామకృష్ణ మిషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1975వ సంవత్సరం ఎస్ఎస్ఎల్‌సీ తెలుగు మీడియం చదువుకుని చెన్నై, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, అమెరికా తదితర ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 50 మందికి పైగా విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.50వేలు విరాళంగా అందజేశారు. తమతో చదువుకుని దివంగతులైన మిత్రుల ఆత్మశాంతికోసం సభలో మౌనం పాటించారు. అలాగే ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమానప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి పద్మస్తానందా మహరాజ్ ఆశీస్సులతో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ దేవసేన హాజరుకాగా, ఆత్మీయ అతిథిగా ఈ పాఠశాలలో 1978వ సంవత్సరం తెలుగు పండితుడిగా చేసి, పీజీ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది 1990లో డీజీ వైష్ణవ కళాశాలలో లెక్చరర్‌గా ఎన్నికైన డాక్టర్ కాసల నాగభూషణం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మఒడిలో జన్మించిన మనం బడిలో ఉత్తమ పౌరులుగా మరో జన్మపొందుతామని, మహాభారతంలో గురువులు శిష్యులను పుత్రులుగా భావిస్తారని సూక్తిఉందని, అందుకు తగ్గట్టుగా ఆదివారం ప్రపంచ పితృదినోత్సవం కావడం ఇదో గొప్ప శుభ సూచికమన్నారు. కార్యక్రమంలో ముందుగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం కన్వీనర్, తెలుగు బ్రాహ్మణ మహాసభ అధ్యక్షులు గోటేటి వెంకటేశ్వరరావు అప్పట్లో విద్యార్థులు సహా ఉపాధ్యాయులతో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. నిర్వాహకులు జీవీ రామగోపాల్, జి.నాగేశ్వరరావు, జేవీఎస్.శర్మ, దామోదర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమానికి తమ గురువులను, ప్రముఖులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.



పుదుచ్చేరి పర్యటనకు వెళుతూ మార్గమధ్యంలో చెన్నై విమానాశ్రయంలో దిగిన ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

డాగ్ షోలో 'జర్మన్ షెపర్డ్' సందడి



పెరంబూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూర్‌లో జరుగుతున్న డాగ్ షోలో 138 జర్మన్ షెపర్డ్ జాగిలాలు పాల్గొన్నాయి. కున్నూర్ ప్రావిడన్స్ కళాశాల మైదానంలో నీలగిరి కెన్నల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 8వ డాగ్ షో ప్రారంభమైంది. నీలగిరి జర్మన్ షెపర్డ్ జాగిలాల సమాఖ్య తరపున నీలగిరితో పాటు పలు రాష్ట్రాలకు చెందిన 138 జర్మన్ షెపర్డ్ జాగిలాలు పాల్గొన్నాయి. జాగిలం వయస్సు, బరువు, వాటి పరిశీలన నైపుణ్యం తదితరాలు పరిశీలించి, విజేతగా నిలిచిన జాగిలం యజమానికి బహుమతులు అందజేశారు. అలాగే, ఆదివారం రాజపాళయం, కారవన్‌హౌంట్, డాబర్‌మెన్, బికిల్, మస్టీప్ సహా పలు జాతులకు చెందిన జాగిలాలు షోలో సందడి చేశాయి.

ఎమ్మార్పీఎస్ నుంచే ఉద్యమాల ఆవిర్భావం

● ఎంఈఎఫ్ నేత ప్రొఫెసర్ శ్రీనివాసరావు



సదస్సులో ప్రొఫెసర్ శ్రీనివాసరావు, నరేంద్రబాబు, గొల్లపల్లి ఇశ్రాయేలు, లోకేశ్‌కుమార్, జక్కయ్యన్ తదితరులు

ప్యారీస్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నుంచే ఉద్యమం పుట్టిందని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఉత్తర్వుల మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ తమిళనాడు విభాగాల ఆధ్వర్యంలో ఎగ్మూర్‌లో శనివారం రాత్రి రిజర్వేషన్ అంశంపై సదస్సు ఘనంగా జరిగింది. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.లోకేశ్‌కుమార్ అధ్యక్షత జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయనేత సొట్టా నరేంద్రబాబు, తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు, ఆదితమిళర్ కట్చి రాష్ట్ర అధ్యక్షులు జక్కయ్యన్, పలు సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నిర్వాహకులు పాల్గొన్నారు. ముందుగా సభాధ్యక్షులు లోకేశ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 250కి పైగా ఉన్న కుల సంఘాలను ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి అరుంధతీయ హక్కులను రాబటుకునేందుకు సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. అరుంధతీయ సమాజానికి విద్య, ఉద్యోగ, న్యాయశాఖ, చట్టసభల్లో దక్కాల్సిన రిజర్వేషన్ హక్కుల కోసం రాష్ట్రంలోవున్న ఆదిఆంధ్రుల కుటుంబాలు, సంఘాలన్నీ భారీస్థాయిలో పోరాడేందుకు ముందుకు రావాలని నరేంద్రబాబు పిలుపునిచ్చారు.